ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 21-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- భారత్-న్యూజిలాండ్ దేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వచ్చే అక్టోబర్ 20 నుండి అమల్లోకి రానుందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.

- రాష్ట్రీయ వయోశ్రీ యోజన కింద 8 లక్షల 53 వేల మందికి పైగా వయోవృద్ధులు లబ్ధి పొందారని కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది.

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 138వ సంచిక ఈ నెల 27న ప్రసారమవుతుంది.

- రానున్న రెండు, మూడు రోజులలో కోస్తాంధ్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మధ్య మహారాష్ట్రలలో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండి) వెల్లడించింది.

==============================

భారత్-న్యూజిలాండ్ దేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వచ్చే నెల 20వ తేదీ నుండి అమల్లోకి రానుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... న్యూజిలాండ్‌కు జరిగే భారతీయ ఎగుమతులకు ఈ ఒప్పందం 100 శాతం సుంకం లేకుండా చేస్తుందన్నారు. రానున్న 4, 5 సంవత్సరాలలో వస్తు సేవల ద్వైపాక్షిక వాణిజ్యాన్ని దాదాపు 35 వేల కోట్ల రూపాయలకు పెంచాలని, అలాగే సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవాలని ఇరు దేశాలు ఆకాంక్షిస్తున్నాయని చెప్పారు. ఈ ఒప్పందం ద్వారా వస్త్రాలు, దుస్తులు, తోలు, పాదరక్షలు, ఇంజనీరింగ్, ఫార్మాస్యూటికల్, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు కొత్త అవకాశాలు లభిస్తాయని పీయూష్ గోయల్ వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రీయ వయోశ్రీ యోజన కింద 8 లక్షల 53 వేల మందికి పైగా వయోవృద్ధులు సుమారు 46 లక్షల సహాయక పరికరాల ద్వారా లబ్ధి పొందారని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ తెలిపింది. అటల్ వయో అభ్యుదయ యోజన (AVYAY) కింద రాష్ట్రీయ వయోశ్రీ యోజన వయోవృద్ధులకు మెరుగైన సహాయాన్ని అందిస్తోందని పేర్కొంది. 2017లో ప్రారంభించబడిన రాష్ట్రీయ వయోశ్రీ యోజన కార్యక్రమం.. ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ALIMCO) ద్వారా వయో సంబంధిత వైకల్యాలు, బలహీనతలతో బాధపడుతూ.. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వర్గాల వారికి ఉచిత సహాయక జీవన పరికరాలను అందిస్తుంది. వయోవృద్ధులలో అందుబాటు, స్వతంత్ర జీవనాన్ని మెరుగుపరచడానికి వీల్‌చైర్లు, చేతికర్రలు, వినికిడి పరికరాలు, కళ్లద్దాల వంటి సహాయక పరికరాలు ఉచితంగా అందిస్తోందని ఆ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సమృద్ధ్ గ్రామ్ కార్యక్రమం.. ఆరోగ్యం, విద్య, ఇ-గవర్నెన్స్, జీవనోపాధి వంటి సేవలను ఒకే చోట అందించడానికి వీలు కల్పించిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సమృద్ధ్ గ్రామ్ కార్యక్రమ తదుపరి దశను.. టెలికమ్యూనికేషన్ల శాఖ, స్టార్టప్‌లు, సేవా భాగస్వాములతో ఆయన ఈరోజు సమీక్షించారు. ప్రతి గ్రామం గడప వద్దకు సాంకేతికతను తీసుకురావాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతను సాకారం చేస్తూ.. జిల్లాల వ్యాప్తంగా విస్తరించడానికి వినూత్న నమూనాలపై సమావేశంలో చర్చించినట్లు మంత్రి సామాజిక మాధ్యమం పోస్టులో పేర్కొన్నారు. కాగా.. వ్యాపార వినియోగదారుల కోసం లాజిస్టిక్స్, కార్యకలాపాలను క్రమబద్ధీకరించడానికి, రూపొందించిన ఇండియా పోస్ట్ కస్టమర్ 360 సెల్ఫ్-సర్వీస్ ప్లాట్‌ఫామ్‌ను కూడా ఆయన ఈరోజు సమీక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 138వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 25వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

`ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం` అనే ఇతివృత్తంతో 11వ ఆయుర్వేద దినోత్సవం ఈ నెల 23వ తేదీన జరగనుంది. అధికారిక ఆయుర్వేద దినోత్సవ వెబ్‌సైట్ లో 3 లక్షలకు పైగా పాల్గొనేవారు నమోదు చేసుకున్నారని ఆయుష్ మంత్రిత్వ శాఖ తెలియజేసింది. అలాగే.. ఆయుర్వేద దినోత్సవం-2026 మైక్రోసైట్ ద్వారా సుమారు 89 లక్షల మంది పౌరులు ఆయుర్వేదానికి తమ మద్దతును కూడా ప్రకటించారని పేర్కొంది. ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు గణనీయమైన భాగస్వామ్యాన్ని నమోదు చేశాయని, ఇది దేశవ్యాప్త వేడుకల్లో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల విస్తృత భాగస్వామ్యాన్ని ప్రతిబింబిస్తోందని ఆ మంత్రిత్వ శాఖ తెలియజేసింది. ayurvedaday.org.in లో అందుబాటులో ఉన్న ఆయుర్వేద దినోత్సవం-2026 మైక్రోసైట్, దేశవ్యాప్త వేడుకలలో భాగంగా నిర్వహించబడుతున్న కార్యక్రమాల పౌర భాగస్వామ్యం, నమోదు, నివేదన కోసం ఒక డిజిటల్ వేదికగా పని చేస్తుందని మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో వెయ్యికి పైగా ప్రతికూల ఔషధ ప్రతిచర్యల పర్యవేక్షణ కేంద్రాలు పని చేస్తున్నాయని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు ఆమె `నేషనల్ ఫార్ములరీ ఆఫ్

ఇండియా` 7వ సంచికను విడుదల చేసిన సందర్భంగా మాట్లాడుతూ... వీటి సంఖ్యను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ప్రపంచంలోని 25 దేశాలు భారత ఫార్మకోపియాను ఆమోదించాయని, ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) రోగి భద్రతా డేటాబేస్‌కు ఫార్మకోవిజిలెన్స్ డేటాను భారత్ అందిస్తోందని పేర్కొన్నారు. WHOకు ఈ డేటాను అందించడంలో భారత్ 2014లో 123వ ర్యాంకు నుంచి 8వ ర్యాంకుకు చేరుకుందన్నారు. ఫార్మకోవిజిలెన్స్‌లో భారతదేశ ప్రయాణం ఆత్మనిర్భరతకు చక్కని ఉదాహరణగా నిలిచిందని అనుప్రియా పటేల్ తెలియజేస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

=============================

ఆగ్జిలరీ పవర్ యూనిట్ల (APU)లను కొనుగోలు చేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ.. యాక్యురేట్ ఇండస్ట్రియల్ కంట్రోల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో ఒక ఒప్పందంపై సంతకం చేసింది. టి-72, టి-90 ట్యాంకుల కోసం ఉద్దేశించిన ఈ యూనిట్లను 586 కోట్ల రూపాయల వ్యయంతో కొనుగోలు చేసేందుకు రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో ఈరోజు న్యూఢిల్లీలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ట్యాంక్‌లోని ఫైర్ కంట్రోల్ సిస్టమ్, ఫైరింగ్ సర్క్యూట్, గన్ స్టెబిలైజేషన్ సిస్టమ్ తదితర అనుబంధ భాగాలకు విద్యుత్ శక్తిని ఉత్పత్తి చేయడానికి APU ఒక ప్రత్యామ్నాయ వనరు అని మంత్రిత్వ శాఖ తెలిపింది. దేశీయంగా అభివృద్ధి చేసిన APUలతో భారత సైన్యం విశ్వసనీయత, సుస్థిరత మరింత బలోపేతమవుతాయని ఆ శాఖ పేర్కొంది.

=============================

భారతదేశ స్వచ్ఛ ఇంధన దార్శనికత సాధనలో సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (SECI) కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద యెస్సో నాయక్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన SECI 15వ వ్యవస్థాపక దినోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ... ప్రపంచ పునరుత్పాదక ఇంధన పరివర్తనలో పెరుగుతున్న భారతదేశ నాయకత్వానికి SECI 15 ఏళ్ల ప్రస్థానం ఒక నిదర్శనమని చెప్పారు. గడచిన 15 సంవత్సరాల్లో SECI.. 41 గిగావాట్లకు పైగా పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని నిర్మించడంలో సహాయపడింది. అలాగే.. సుమారు 3.6 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించింది.

=============================

`నోమాడిక్ ఎలిఫెంట్` పేరిట భారత్-మంగోలియా దేశాల సంయుక్త సైనిక విన్యాసం 18వ ఎడిషన్ ఉత్తరాఖండ్ పిథోరగఢ్‌లోని ఫారిన్ ట్రైనింగ్ నోడ్‌లో ఈరోజు ప్రారంభమైంది. ఇది భారత్, మంగోలియా దేశాల మధ్య మాత్రమే నిర్వహించే వార్షిక ప్లాటూన్-స్థాయి విన్యాసమని రక్షణ మంత్రిత్వ శాఖ తెలియజేసింది. ఐక్యరాజ్యసమితి ఆదేశాల మేరకు పాక్షిక పట్టణ, పర్వత ప్రాంతాలలో తిరుగుబాటు నిరోధక కార్యకలాపాలు చేపట్టేందుకు ఇరుపక్షాల సంయుక్త సైనిక సామర్థ్యాన్ని పెంపొందించడమే ఈ విన్యాసాల లక్ష్యమని పేర్కొంది. రెండు సైనిక దళాలకు వాస్తవిక కార్యాచరణ పరిస్థితులలో కలిసి శిక్షణ పొందేందుకు, సంయుక్తంగా పనిచేసే వారి సామర్థ్యాన్ని బలోపేతం చేసుకునేందుకు ఒక అవకాశాన్ని కల్పిస్తాయని వివరించింది. వచ్చే నెల 3వ తేదీ వరకు జరిగే ఈ సంయుక్త శిక్షణ జరగనుంది.

=============================

రానున్న రెండు, మూడు రోజులలో కోస్తాంధ్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మధ్య మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండి) తెలిపింది. రేపటి వరకు అండమాన్ నికోబార్ దీవులు, కర్ణాటక, ఒడిశా, రాయలసీమ, తమిళనాడు, పుదుచ్చేరి, తెలంగాణలలో ఉరుములతో కూడిన మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అలాగే మత్స్యకారులు తూర్పు-మధ్య, ఈశాన్య బంగాళాఖాతంలోకి వేటకు వెళ్లవద్దని ఐఎండి హెచ్చరించింది.

=============================

అమెరికాలోని న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం (UNGA) 81వ సెషన్‌లో భారత ప్రతినిధి బృందానికి విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ నేతృత్వం వహించనున్నారు. ఈ నెల 26వ తేదీన జరిగే 81వ UN జనరల్ అసెంబ్లీ ఉన్నత స్థాయి సెషన్‌లో ఆయన ప్రసంగించనున్నారు.

================================
================================